జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శుక్రవారం | 23 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 7

జన గణన సమాచారం
పక్కాగా సేకరించాలి

- జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రెండో దశ జనాభా గణనపై చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు ఐడీఓసీలో శిక్షణ



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ – 22 (ప్రజాజ్యోతి) జన గణన సమాచారం క్షేత్రస్థాయిలో నాణ్యతతో పక్కాగా సేకరించాలని జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భారతజనగణన–2027లో భాగంగా రెండో దశ జనాభా గణన

మిగతా 2 లో... ▸

శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



వేములవాడ,అక్టోబర్,22:ప్రజాజ్యోతి. వేములవాడలోని పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నినాల జయసూర్య గురువారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనము అనంతరం ఆలయ మండపంలో ఆలయ డి ఇ ఓ ప్రతాప నవీన్ కుమార్ శేషవస్త్రం కప్పి సత్కరించగా, పి ఆర్ ఓ పెరిక శ్రీనివాస్ స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి ఎఫ్ఏసీ కుమారి గద్దం మేఘన , వేములవాడ పట్టణ సిఐ వీర ప్రతాప్ ఆలయ శ్రీమతి ఏ ఈ ఓ జయ కుమారి ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ ఆలయ ఉద్యోగులు వేద పండితులు ఉన్నారు



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు
ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

- తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత.. యాసంగిలో వరి సాగును ప్రోత్సహించవద్దు
- వచ్చే జూన్ వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రానున్న ఎనిమిది నెలల నీటి అవసరాలకు అనుగుణంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పశువుల నీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. యాసంగిలో వరి సాగును ప్రోత్సహించకుండా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని స్పష్టం చేశారు. గురువారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులు, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరా, పశువులకు నీరు, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఇతర జిల్లాలతో పోలిస్తే జగిత్యాల జిల్లాలో వర్షపాతం లోటు తక్కువగా ఉందని, ప్రస్తుత ఖరీఫ్ పంటలను సాధ్యమైనంత వరకు కాపాడేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ), చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని

మిగతా 2 లో... ▸

జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- 25 ఎకరాల్లో నిర్మాణం.. ఈ నెల 25న మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన
- నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి. . తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాలను తాటిపల్లి–మోరపల్లి శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ నెల 25వ తేదీన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల

మిగతా 2 లో... ▸

ఫ్యాన్ కు ఊరిసుకోని
వివాహిత ఆత్మహత్య



గొల్లపెల్లి అక్టోబర్ 22 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామానికి చెందిన సబ్బనేవేని మానస (28) కొన్ని సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన తిరుపతితో వివాహం జరిగింది. వివాహం అనంతరం భార్యాభర్తలు ఇద్దరు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు.దసరా పండుగ సందర్భంగా స్వగ్రామమైన వెనుగుమట్లకు గ్రామానికి వచ్చి ఉంటున్నారు అయితే మృతురాలికి గత మూడు సంవత్సరాల నుండి మానసిక ఆరోగ్యం బాగా లేనందున హైదరాబాద్ మరియు ముంబై హాస్పిటల్లో చూపించిన నాయామ్ కాలేదు అని తండ్రి లింగయ్య తెలిపారు ఫిర్యాదు దారుని కూతురికి మానసిక స్థితి బాగా లేనందున గురువారం మధ్యాహ్నం 2:40 గంటల సమయంలో మానస ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతి చెందగా మృతురాలి తండ్రి సబ్బనేవేని లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి ఎస్సై ఏం కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

(మొదటి పేజీ తరువాయి...)

ఎమ్మెల్యే దా.సంజయ్‌కుమార్ మండల,స్థానిక నాయకులతో కలిసి పాఠశాల నిర్మాణ స్థలాన్ని, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, సభ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు, స్థానిక నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గానికి ఈ ప్రతిష్టాత్మక పాఠశాల మంజూరు కావడం సంతోషకరమన్నారు. 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో పాఠశాల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పాఠశాల గొప్ప వరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మాజీ జడ్పీటీసీ పెండెం రాములు, సర్పంచులు కట్ట రాజేందర్, గంగా రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎంఆర్ఓ హకీం, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సమీండ్ల శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు భూమారెడ్డి, కౌన్సిలర్లు తిరుమలయ్య, కమల్, ఏఎంసీ డైరెక్టర్ గడ్డం గంగా రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు నీరటి గంగారెడ్డి, శ్రీనివాస్, నలువల సురేష్, తిరుపతి, దాసరి సతీష్, నరేష్, మాజీ సర్పంచులు గంగారం, సదానందం, టిల్లు, ప్రవీణ్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన గణన సమాచారం పక్కాగా సేకరించాలి



(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహణపై ఛార్జ్ ఆఫీసర్ల(తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లు ఎంపీడీఓల)కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనాభా గణన రెండో దశను సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో గణన ప్రక్రియ అమలు, గణన సిబ్బంది విధులు, బాధ్యతలు, జనాభాకు సంబంధించిన వివరాల కచ్చితమైన సేకరణ, సమాచార నమోదు, సంబంధిత మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్ల నుంచి వివరాలు సేకరించి ..హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల ఆధునీకరణ పూర్తి చేయాలని సూచించారు. 800 కంటే జనాభా ఎక్కువ ఉంటే నూతన ఎన్యూమరేషన్ బ్లాక్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జనాభా గణన అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ కార్యక్రమమని, ఈ ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి సంబంధించిన 40 ప్రశ్నలతో కూడిన వివరాలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు తమ పరిధిలోని గణన సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, జన గణన–2027 రెండో దశ జనాభా గణనను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా జనగణన అధికారి & ముఖ్య ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

సంరక్షించాలన్నారు. మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి నీటి ఒత్తిడికి గురవుతున్న పంటలను గుర్తించాలని, అవసరమైతే పొరుగు రైతుల బోర్ల నుంచి నీటిని అందించే అవకాశాలను పరిశీలించి రైతుల మధ్య సమన్వయం కల్పించాలని ఆదేశించారు. యాసంగి సాగు ప్రణాళికను ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలని, ఎస్ఆర్ఎస్పీ నుంచి యాసంగి పంటలకు నీటి విడుదల చేసే అవకాశం లేనందున వరి సాగుకు దూరంగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి మండలంలో రైతులతో సమావేశాలు నిర్వహించి గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఉద్యాన పంటలు, కూరగాయల సాగుకు ప్రోత్సాహం

రైతుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించేందుకు కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల సాగును విస్తరించాలని మంత్రి సూచించారు. కోతుల బెడద ఉన్న ప్రాంతాల్లో సౌర విద్యుత్‌తో పనిచేసే ఫెన్సింగ్ ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మసేద్య పద్ధతులను వినియోగించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపునకు VB-GRAMG పథకం ద్వారా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని,



తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

భూగర్భ జలాల తగ్గుదలపై కలెక్టర్ ఆందోళన

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 11 శాతం లోటు నమోదైందని, గత ఏడాదితో పోలిస్తే వర్షపాతం 16 శాతం తగ్గిందని తెలిపారు. అక్టోబర్ 22 నాటికి 20 మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని వివరించారు. జిల్లాలో మొత్తం 4,20,908 ఎకరాల్లో పంటలు సాగు కాగా, 3,02,860 ఎకరాల్లో వరి సాగవుతోందన్నారు. సుమారు 3,107 ఎకరాల్లో పంటలు నీటి ఒత్తిడికి గురయ్యాయని, 97 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయిందని పేర్కొన్నారు. పంటల పరిస్థితిని నిరంతరం పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. కోడిమ్యాల మండలంలో భూగర్భ జలమట్టం 10 మీటర్లకు మించి పడిపోయిందని, కోరుట్ల, జగిత్యాల పట్టణం, మల్యాల ప్రాంతాల్లోనూ నీటి మట్టాలు తగ్గుతున్నాయని వివరించారు. ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

వచ్చే జూన్ వరకు తాగునీటి సరఫరాకు ప్రణాళిక

మిషన్ భగీరథ ద్వారా వచ్చే జూన్ వరకు జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మోటార్లకు మరమ్మతులు చేపట్టడం, అవసరమైన విడిభాగాలను అందుబాటులో ఉంచడం, నీటి శుద్ధి కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నిర్వహించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 36.269 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, వేసవి తాగునీటి అవసరాల కోసం తగిన నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని 1,058 చెరువుల్లో సగటున 61 శాతం నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. తాగునీటి వనరులను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు.

యాసంగిలో వరి సాగును తగ్గించాలి: ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, ఎస్ఆర్ఎస్పీ నుంచి నీటి విడుదలపై అనిశ్చితి నేపథ్యంలో యాసంగి వరి సాగును ప్రోత్సహించకూడదన్నారు. వ్యవసాయ శాఖ ప్రతిపాదించిన రెండు లక్షల ఎకరాల సాగు లక్ష్యాన్ని ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా సమీక్షించాలని సూచించారు. రైతులతో చర్చించి తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేయాలన్నారు. రాయికల్ చెరువు పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు కీలకమని, చెరువులో వరి సాగు చేపడితే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెరువుల్లో నీటిని సంరక్షిస్తూ ఎండిపోతున్న పంటలకు అవసరమైన మేరకు నీరు అందించేలా సమతుల్య ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు, చిన్న కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టాలని, తండాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మంచానికే పరిమితమైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్

- వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించండి.. కుటుంబ సభ్యుల వేడుకోలు

కోనరావుపేట, అక్టోబర్. 22 (ప్రజాజ్యోతి) పదేళ్లుగా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని వందలాది మంది కూలీలకు ఉపాధి కల్పించి, వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరించిన ఫీల్డ్ అసిస్టెంట్ స్వప్న ప్రస్తుతం అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. మెరుగైన వైద్యం చేయించేందుకు ఆర్థిక స్థోమత లేక ఆమె కుటుంబ సభ్యులు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన పులి స్వప్న సుమారు పదేళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ గ్రామంలోని వందలాది మంది కూలీలకు పని కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఉపాధి పనుల ద్వారా పేద కుటుంబాలకు ఆదాయం సమకూరేలా కృషి చేశారు. అలాంటి స్వప్న ఇప్పుడు అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా స్వప్నకు



గర్భసంచి ఆపరేషన్ చేయగా, ఆపరేషన్ అనంతరం కొంతకాలం ఆరోగ్యం మెరుగ్గా ఉన్నప్పటికీ, గత రెండు నుంచి మూడు నెలలుగా ఆమె మంచానికే పరిమితమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే వైద్యం కోసం సుమారు రూ.4 లక్షల వరకు అప్పు చేసి ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ మెరుగైన వైద్యం అవసరం కావడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. స్వప్న భర్త రాజుతో పాటు ఇద్దరు కుమార్తెలు నక్షత్ర, శివాత్మిక ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న స్వప్న అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పిల్లల భవిష్యత్తు, వైద్య ఖర్చులను తలచుకొని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ఎంతోమంది పేద కుటుంబాలకు ఉపాధి కల్పించిన స్వప్నకు ఇప్పుడు సమాజం నుంచి ఆపన్నహస్తం అవసరమని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్పందించి ఆమె మెరుగైన వైద్యం కోసం తమవంతు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు ఆర్థిక సహాయం అందించాలనుకునేవారు ఫోన్‌పే నంబర్: 8978398425 ద్వారా తమవంతు సహకారం అందించి స్వప్న కుటుంబానికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరారు. ఆపదలో ఉన్న కుటుంబానికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న సర్పంచ్





♦ బావుసాయిపేట గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా

కోనరావుపేట, అక్టోబర్. 22(ప్రజాజ్యోతి)కొనరావు పేట మండలం బావుసాయిపేట: ఎన్నికల సమ యంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్క టిగా నెరవేరుస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా ప్రజల మన్ననలు పొందుతున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కొరతను గుర్తించి, ప్రజ లకు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఎన్నికల సమ యంలో గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించ డంతో పాటు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పి స్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను మరువకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని.

ఇందులో భాగంగా గ్రామంలో జంబి గద్దె ఏర్పాటు, పేదింటి ఆడపడుచులకు గ్రామం తరఫున రూ.2,వేల విలువైన చీర అందించడం, డ్రైనేజీ నిర్మాణాలు, డ్రైనే జీల శుభ్రత, సీసీ రోడ్ల నిర్మాణం, మహిళా సంఘ భవన నిర్మాణం వంటి పనులను ఒక్కొక్కటిగా నెరవే రుస్తున్నామని తెలిపారు.

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ డ్రైనేజీల శుభ్రతపై దృష్టి సారిస్తామని ప్రజలకు రాక పోకల్లో ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్ల నిర్మాణా నికి చర్యలు చేపడుతామని అన్నారు. మహిళా సంఘా లకు అవసరమైన భవన సదుపాయం కల్పించే దిశగా కూడా పనులు కొనసాగిస్తున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేం దుకు కృషి చేస్తానని సూచించారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ గ్రామ అభి వృద్ధే లక్ష్యంగా ముందుకు కొనసాగుతామని. రానున్న రోజుల్లో ప్రజల సహకారం, ఆశీర్వాదాలతో బావుసాయిపేట గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు.

నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

• గొల్లపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అభినందనలు



ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 22 ప్రజా జ్యోతి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, వైస్ చైర్మన్ నంది కిషన్‌లను ఘనంగా సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, వ్యవసాయ ఉత్ప త్తుల విక్రయాల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయా లని ఆకాంక్షించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. చైర్మన్‌గా మేడిపల్లి దేవా నందం, వైస్ చైర్మన్‌గా నంది కిషన్ బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వారి నాయకత్వంలో మార్కెట్ కమిటీ అభివృద్ధి సాధించాలని నాయ కులు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, అందె బాబయ్య, , సత్తిరెడ్డి, అందె దేవరాజు, లాల, ఎల్లయ్య, నాగిరెడ్డి, దేవ రాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఫ్లెక్సీ ధ్వంసం

• పోలీసులకు ఫిర్యాదు చేసిన మహేందర్...





ధర్మారం, అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి న్యూస్): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు కొత్తూరి మహేందర్ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి చింపివే శారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై ధర్మారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మహేందర్ తెలిపారు. ఫ్లెక్సీ చింపివేత ఘటనను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడికందుల సురేష్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షతోనే ఈ చర్యకు పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గ్రామంలో రాజ కీయ వాతావరణాన్ని కలుషితం చేసే ఇటువంటి ఘటనలను సహించబోమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమే అయి నప్పటికీ, ఇతరుల శుభాకాంక్షల ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, ఫ్లెక్సీని చింపివేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మారం ఎస్సై శ్రీకాంత్‌ను కోరినట్లు మహేందర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మోతె కావ్య వెంకటేష్, దేవస్థానం చైర్మన్ పోలుదాసరి సంతోష్, మాజీ అధ్య క్షుడు నూనె మల్లేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, దళితులు పాల్గొని ఘటనను ఖండించారు.

కేటీఆర్ ను కలిసిన డాక్టర్ దాసరి మమతా రెడ్డి, ప్రశాంత్ రెడ్డి

► ...దసరా శుభాకాంక్షలు



పెద్దపల్లి ప్రతినిధి 22 అక్టోబర్ ప్రజా జ్యోతి: దసరా పండుగను పురస్కరించు కుని పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, యువ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజ యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో వారు పరస్పరం పండుగ శుభా కాంక్షలు తెలియజేసుకుంటూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

ప్రభుత్వ విప్ ను కలిసిన కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు



ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్ల పెల్లికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి గురువారం రోజు వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు ఆదిశ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు మండలంలోని రైతు సమస్యల పైన మాట్లాడారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. మరొకరికి గాయాలు



ధర్మారం,అక్టోబర్ 22(ప్రజా జ్యోతి న్యూస్): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్ ఖాన్‌పేట గ్రామానికి చెందిన జవ్వాజి రాధాకృష్ణ(23)రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా,అతడి స్నేహితుడు బుర్ర సాయికి గాయాల య్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 21న రాధాకృష్ణ తన పల్సర్ బైక్ (నంబర్ TG 22 BA 2449)పై స్నేహితుడు బుర్ర సాయితో కలిసి అబ్బాపూర్ గుడి వద్దకు వెళ్లి తిరిగి స్వగా మానికి వస్తున్నాడు.ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది.ఈ ప్రమాదంలో రాధాకృష్ణ చెవి,ముక్కు నుంచి రక్తస్రావం కాగా,ఆసుపత్రికి తరలి స్తుండగా మృతి చెందాడు.బుర్ర సాయికి గాయాలయ్యాయి.ఈ ఘటనపై జవ్వాజి కనుకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

ప్రభుత్వ విప్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కొలనూరు సింగిల్ విండో చైర్మన్



కోనరావుపేట,అక్టోబర్. 22(ప్రజాజ్యోతి) దసరా పండుగను పురస్కరించుకుని కొలనూరు సింగిల్ విండో చైర్మన్ బొమ్మెన భాస్కర్ రావు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆది శ్రీనివాస్‌ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు.

బిజెపి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం

కరీంనగర్, అక్టోబర్ 22 (ప్రజాజ్యోతి) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం గురువారం రోజున జిల్లా శాఖ కార్యవర్గ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గా గుర్రాల వెంకట్ రెడ్డి ,బింగి వేణు ఎర్రబెల్లి సంపత్ రావు , దురిశెట్టి సంపత్ ,సిహెచ్. నరసింహరాజు గాజుల స్వప్న , జిల్లా ప్రధాన కార్యదర్శులు గా గుజ్జ శ్రీనివాస్ రావు , మాడ వెంకట్ రెడ్డి కాసుమల్ల గణపతి , జిల్లా కార్యదర్శులు గా గుంజేటి శివ కుమార్ ,కోల అశోక్ , సంపెల్లి సంపత్ రావు, చేపురి సత్యం గౌడ్ ,ధాడి సునీత , రెడ్డవేని రాజు , జిల్లా కార్యాలయ కార్యదర్శి గా కాడార్ల వినోద్ కుమార్ . జిల్లా ఐటీ కన్వీనర్ అన్నాజి వినీత్ కుమార్ ,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గొడుగు వినోద్ కుమార్ ల నియామకం జరిగింది. జిల్లాలో భారతీయ జనతా పార్టీ నీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి , కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు , నిర్ణయాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నూతన జిల్లా కార్యవర్గం తగిన కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం సూచించారు.

సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్...

► క్వింటాల్‌కు రూ.2,961 పొందాలి – మండల వ్యవసాయ అధికారి కే. ప్రకాష్



ధర్మారం,అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి న్యూస్):సన్న వడ్లను విక్రయించే విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని,దళారుల మాటలు నమ్మి తక్కువ ధరలకు పంట ఉత్పత్తులను విక్రయించి నష్టపోవద్దని మండల వ్యవసాయ అధికారి కే.ప్రకాష్ సూచించారు.ధర్మారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దొంగతుర్తి, రామయ్యపల్లె గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను అధికారులు సందర్శించి, వరి సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,461తో పాటు సన్నవడ్లకు రూ.500బోనస్ కలిపి మొత్తం రూ.2,961 పొందేలా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.రైతులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం పొందాలంటే మార్కెట్‌లో పంటలకు లభిస్తున్న ధరలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దళారుల ప్రలోభాలకు గురికాకుండా, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో పాటు అర్హత మేరకు బోనస్ ప్రయోజనం పొందాలని సూచించారు.ధాన్యం విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని మోసపోకుండా ఉండాలని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ అందించే సలహాలు, సూచనలు, సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని పంటలకు గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వినీత్, రైతులు పాల్గొన్నారు

ఉషన్నపల్లె పాఠశాలకు గ్లాస్ బోర్డు అందజే సిన అనుముల అశోక్ రెడ్డి



కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని. ఉషన్న పల్లె గ్రామంలో గల. ఆంగ్ల మధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో .రూపాయలు 20వేల విలువచేసే. గ్లాస్ బోర్డును. అనుముల అశోక్ రెడ్డి గురువారం రోజున పాఠశాలకు. విరాళంగా అందజేశారు. గ్లాస్ బోర్డును అందజేసిన ఆయనను. పాఠశాల ఉపాధ్యాయ బృందం తో పాటు. గ్రామస్తులు .విద్యార్థులు. అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఈర్ల సమ్మయ్య. అనుముల శ్రీనివాసరెడ్డి. పాత్రికేయులు ముసుకు అశోక్. రేకుల రఘు. అనుముల రాజేశం. అనుముల శ్రీనివాసరెడ్డి. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి

- బ్యాంకర్లు.. జిల్లా అధికారులు సమన్వయంతో ప్రజలకు పథకాలు అందించాలి
- వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, మహిళా సంఘాలకు, ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయాలి
- డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశంలో చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ – 22 (ప్రజాజ్యోతి) జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అడిటోరియంలో గురువారం నిర్వహించారు.ముందుగా వ్యవసాయం, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ అమలు, పురోగతి, లక్ష్య సాధన పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన అన్ని విభాగాల రుణాల లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. **వ్యవసాయ, విద్య, స్వయం ఉపాధి, గృహ తదితర రుణాల పంపిణీ లక్ష్యం** 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు.ఆర్ సేటీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని సూచించారు.ఇప్పటి వరకు 13 విభాగాల్లో 314 మందికి శిక్షణ ఇచ్చిన సంస్థ ప్రతినిధులను అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని సూచించారు.మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు. మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో మహిళా సంఘాలకు ప్రభుత్వ రుణాలపై అవగాహన కల్పించాలని, అర్హులైన వారికి రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో బ్యాంకులు అర్హులైనవారికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు.జిల్లాలోని ఆయా బ్యాంకర్లు.. జిల్లా అధికారులు సమన్వయంతో ప్రజలకు పథకాలు అందించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్ డీ ఎం రాజీవ్‌కుమార్, ఆర్ బీ ఐ ఎల్ డీ ఓ చేతన్ ఎం గోరేఖర్, నాబార్డ్ డీ డీ ఎం దిలీప్ చంద్ర, యూ బీ ఐ బ్యాంక్ అధికారి కృష్ణమాచారి, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు నాయకులు



వేములవాడ,అక్టోబర్,22:(ప్రజాజ్యోతి.దసరాపండుగనుపురస్కరించుకొనిరాజన్నసిరిసిల్లజిల్లా మున్నూరు కాపు నాయకులు ప్రభుత్వవిప్‌ను ,మర్యాదపూర్వకంగా కలిసి పండుగశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు పటేల్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల. కొమురయ్య, ప్రధాన కార్యదర్శి పొంచేట్టి. శంకర్, వేములవాడ పట్టణ మాజీ కౌన్సిలర్, ఉమ్మడి మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు ఇప్పపూల. అజయ్, గోలి. లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు

ఘనంగా పండుగ సాయన్న జన్మదిన వేడుకలు

- ఆయన సేవలు వెలకట్టలేనివి .సర్పంచ్ బంగారి రమేష్.



కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల.ముదిరాజు కమ్యూనిటీ హాల్లో.పండగ సాయన్న జన్మదిన వేడుకలను. ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో గురువారం రోజున ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షుడు చెప్పాలా సారయ్య. ఉపాధ్యక్షులు చిలు వేరు రమేష్. నాయకులు అన్వేష్. మల్లేష్. నాగరాజు. కొమురయ్య .రాజ్ కుమార్. నరేష్ .ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో సీపీ ప్రత్యేక పూజలు





కరీంనగర్ క్రైం, అక్టోబర్ 22, (ప్రజాజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. అలాగే పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం,ప్రజల సంక్షేమం,సమాజంలో శాంతిభద్రతలు వెల్లివిరియాలని కోరుతూ ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు, అర్చనలు జరిపించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ సమాజ శాంతి, ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి,వెంకటస్వామి, విజయకుమార్ తో పాటు టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడలో ఆరు రోజుల పాటు రోడ్డు అభివృద్ధి పనులు

- మూలవాగు బ్రిడ్జి నుంచి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు 80 ఫీట్ల రహదారిపై పనులు
- అక్టోబర్ 23 నుంచి 28 వరకు ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి

వేముల వాడ , అక్టోబర్, 22: ప్రజాజ్యోతి. పట్టణంలో రోడ్డు అభివృద్ధి పనుల నేపథ్యంలో వాహనదారులు, భక్తులు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణంలోని మూలవాగు బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు ఉన్న 80ఫీట్ల రహదారిపై అక్టోబర్ 23 నుంచి 28వ తేదీ వరకు ఆరు రోజుల పాటు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనుల కారణంగా ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహించే సమయంలో వాహనాల రాకపోకల వల్ల పనులకు ఆటంకం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ ను దారి మళ్లించనున్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాహనదారులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సూచనలు, ఆదేశాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

భక్తులు, పట్టణ ప్రజలు వ్యాపారులు సహకరించాలి

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారి అభివృద్ధి పనులు జరిగే ఆరు రోజుల పాటు భక్తులు, పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, వాహనదారులు ముందస్తుగా ప్రణాళిక చేసుకుని ప్రయాణాలు సాగించాలని అధికారులు సూచించారు. పనులు జరిగే మార్గంలో అనవసరంగా వాహనాలు తీసుకురాకుండా, ట్రాఫిక్ పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రహదారి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేయకుండా, బారికేడ్లను తొలగించకుండా, హెచ్చరిక బోర్డులను గమనిస్తూ ప్రయాణించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మున్సిపల్, పోలీసు శాఖల సిబ్బంది తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరు రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు కృషి

ప్రజలకు సాధ్యమైనంత తక్కువ అసౌకర్యం కలిగేలా రోడ్డు అభివృద్ధి పనులను నిర్ణీత ఆరు రోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఎదురైనా, భవిష్యత్తులో మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రావడానికి ఈ పనులు దోహదపడతాయని పేర్కొన్నారు. కావున, అక్టోబర్ 23 నుంచి 28వ తేదీ వరకు మూలవాగు బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు 80ఫీట్ల రహదారిపై ప్రయాణించే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ రోడ్డు అభివృద్ధి పనులు సజావుగా పూర్తయ్యేందుకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్,బి ఆర్ ఎస్ పరస్పర విమర్శలు

- టీ ఆర్ ఎస్ బలోపేతానికి కృషి
- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు
- తెలంగాణ రక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి సారయ్య



గోదావరిఖని, అక్టోబర్ 22 (ప్రజాజ్యోతి) కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ రెండు పార్టీలు పరస్పర విమర్శలు చేసుకుంటూ ప్రజా సమస్యలతో పాటు సింగరేణి కార్మికుల సమస్యలను గాలికి వదిలేశాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పెద్దపల్లి పార్లమెంటు ఇన్చార్జి తిప్పారపు సారయ్య, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి,పార్టీ సీనియర్ నాయకులు రియాజ్ అహ్మద్ తెలిపారు.గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.తమ పార్టీ బలోపేతంలో భాగంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్దపల్లి జిల్లా కమిటీ తో పాటు రామగుండం కార్పొరేషన్,రామగుండం నియోజకవర్గం కమిటీలను ప్రకటించినట్లు పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా బొల్లం మహేందర్,కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడిగా అరెల్లి పోశం,అధికార ప్రతినిధిగా పల్లి క్రాంతి కుమార్,ప్రధాన కార్యదర్శిగా దూత రామ్మోహన్,యువజన అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డిని నియమించినట్లు వెల్లడించారు.

కథలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





కథలాపూర్, అక్టోబర్ 22 ప్రజాజ్యోతి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కథలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, ప్రజలకు భద్రతాభావం కల్పించేలా విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. రాత్రి పెట్రోలింగ్ పెంచాలని, గంజాయి అక్రమ రవాణా, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

బిజెపి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బింగి వేణు



మల్యాల, అక్టోబర్ 22,ప్రజాజ్యోతి: బిజెపి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం గురువారం రోజున ప్రకటించారు.చొప్పదండి నియోజకవర్గం వర్గానికిగాను మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బింగి వేణును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా బింగి వేణు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు, జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం కు, సీనియర్ నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం ఇంకా కష్టపడి పార్టీ యొక్క సంక్షేమ పథకాలు ప్రజలకు తెలుపుతూ ప్రజలకు చేరువయ్యేలా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తానని అన్నారు. తనకు ఎంతగానో సహకరించిన మల్యాల మండల బిజెపి పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బింగి వేణు ప్రతిభను గుర్తించి తనకు సముచిత పదవిని కేటాయించినందుకు మల్యాల మండల బిజెపి పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.



జగిత్యాల, అక్టోబర్ 22 , ప్రజాజ్యోతి. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైద్య చికిత్సల ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, గట్టు సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు



మల్లాపూర్, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తంగేడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.వెల్లిరా బతుకమ్మ..మళ్లీ రావమ్మా బతుకమ్మ అంటూ పాటలు పాడుతూ బతుకమ్మలను సాగనంపారు.ఒకప్పుడు గ్రామాల్లో మహిళలంతా కలిసి బతుకమ్మ ఆడిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు గ్రామాల్లో పండుగ శోభను సంతరించుకున్నాయి.

ఫ్లెక్సీల చింపివేత.. ఫిర్యాదు



కొడిమ్యాల,అక్టోబర్ 22,(ప్రజాజ్యోతి):

మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో దసరా సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం, బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారని అందిన ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో జీడీ ఎంట్రీ నమోదు చేసినట్లు ఎస్సై ఎ.నరేష్‌కుమార్ తెలిపారు. ఈ ఘటన నాన్ కాగ్నిజబుల్ నేరం పరిధిలోకి వస్తున్నందున న్యాయస్థానం అనుమతి తీసుకున్న అనంతరం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

► ఆటపాటలతో అలరించిన ఆడపడుచులు.. పూల పండుగతో పల్లెల్లో పండుగ శోభ





రాయికల్, అక్టోబర్ 22 (ప్రజాజ్యోతి) రాయికల్ మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్, రామాజీపేట, మైతాపూర్, మూటపెల్లి, కొత్తపేట, చింతలూరు, భూపతిపూర్ తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.ఆడపడుచులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఇళ్లలో భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి పూజించిన మహిళలు, చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గునుగు, తంగేడు, బంతి, చేమంతి తదితర రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను చేతబట్టి గ్రామాల్లోని చెరువులు, వాగుల వద్దకు చేరుకున్నారు. కొత్త దుస్తులు ధరించి, సంప్రదాయ అలంకరణలతో తరలివచ్చిన మహిళలతో పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.చెరువులు,వాగులపరిసరాల్లో మహిళలు వలయాకారంలో నిలబడి బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..” అంటూ లయబద్ధంగా పాటలు పాడుతూ చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ పాటలతో పల్లె వాతావరణం మార్మోగింది.అనంతరం మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను నిమజ్జనం చేసి, సద్దులను ఒకరికొకరు పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దల ఆశీర్వాదాలు తీసుకుంటూ ఆప్యాయతలను పంచుకున్నారు. పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలకు సారె పెట్టి అత్తవారింటికి సాగనంపే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామాల్లో ఆనందోత్సాహాలను నింపాయి. పూల పండుగతో పల్లెల్లో వెల్లివిరిసిన సందడి, మహిళల ఐక్యతను, కుటుంబ అనుబంధాలను మరోసారి చాటిచెప్పింది.





కాంగ్రెస్‌లో కార్యకర్తలకు... అన్యాయం జరుగుతోందా?





- అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు కరువైందా?
- ఆవేదనతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన మ్యాదరి లక్ష్మణ్!
- ఎమ్మెల్యే అభ్యర్థిగా జువ్వాడి నర్సింగ్‌రావు పోటీ చేసినప్పుడు ఆరో వార్డులో కాంగ్రెస్‌కు 50 ఓట్ల ఆధిక్యం తీసుకొచ్చామని వెల్లడి
- పార్టీ కోసం పనిచేసినా తగిన గుర్తింపు లేదని ఆవేదన..
- కోరుట్ల కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారిన రాజీనామా ప్రకటన

కోరుట్ల, అక్టోబర్ 22 ప్రజాజ్యోతి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు తగిన గుర్తింపు, న్యాయం లభించడం లేదా? పార్టీ కోసం ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి చివరకు నిరాశే మిగులుతోందా? అనే ప్రశ్నలు కోరుట్ల రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన మ్యాదరి లక్ష్మణ్ తాజాగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసినప్పటికీ, తగిన గుర్తింపు లభించడం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన తన రాజీనామా ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ మహిళా రిజర్వేషన్‌తో తొలిసారి కాంగ్రెస్ తరఫున పోటీ

కోరుట్ల మున్సిపాలిటీలో ఏకిన్‌పూర్ గ్రామం విలీనమైనతర్వాత,ఆరో వార్డు ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో



తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసినట్లు మ్యాదరి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడంతో పాటు, పార్టీ గుర్తుపై పోటీ చేసేందుకు చాలామంది ముందుకు రాని పరిస్థితుల్లో తాను పార్టీ తరఫున బరిలోకి దిగినట్లు తెలిపారు.తన మిత్రులు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రజలు, యువకుల సహకారంతో ఎన్నికల్లో పోరాడినప్పటికీ, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందాల్సి వచ్చిందని వివరించారు.ఓటమి ఎదురైనా పార్టీని వీడకుండా కాంగ్రెస్ కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటూ వచ్చానని తెలిపారు.


ఎన్నికల సమయంలో పార్టీ కోసం శ్రమించా.. ఆర్థికంగా వెనుకబడ్డా!

కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పాల్గొనడంతో పాటు, జన సమీకరణలోనూ చురుకుగా వ్యవహరించినట్లు మ్యాదరి లక్ష్మణ్ వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గంలో జువ్వాడి నర్సింగ్‌రావు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో పార్టీ విజయం కోసం నిరంతరం కృషి చేశానని పేర్కొన్నారు.



ఆ ఎన్నికల్లో కోరుట్ల పట్టణంలోని 33 వార్డుల్లో ఆరో వార్డు (ఏకిన్‌పూర్) నుంచి కాంగ్రెస్ పార్టీకి 50 ఓట్ల ఆధిక్యం తీసుకురావడం తమ కృషికి నిదర్శనమని ఆయన తన ప్రకటనలో గుర్తుచేశారు.ఎంపీ ఎన్నికల్లోనూ పార్టీ కోసం పనిచేశానని, ఏకిన్‌పూర్ సహకార సంఘం ఎన్నికల్లో ఇద్దరు డైరెక్టర్లను గెలిపించడంలో కృషి చేశానని తెలిపారు. అయినప్పటికీ, పార్టీ కోసం పనిచేసిన తనలాంటి కార్యకర్తలకు తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారంలోకి వచ్చినా కార్యకర్తల పరిస్థితిలో మార్పు లేదా?



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశించానని,అయితే తన విషయంలో ఆ ఆశ నెరవేరలేదని మ్యాదరి లక్ష్మణ్ పేర్కొన్నారు.పార్టీ కోసం పనిచేసే క్రమంలో ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోయామని, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల బాధ్యతలు నిర్వహించేందుకు గతంలో ఉన్న వనరులు కూడా ఇప్పుడు లేవని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.పార్టీని నమ్ముకొని పనిచేసిన కార్యకర్తలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? వారి కష్టాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకత్వంపై లేదా? అనే ప్రశ్నలు ఈ పరిణామంతో మరోసారి తెరపైకి వస్తున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో ను పార్టీ కోసం కృషి

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ దగ్గరుండి ఓట్లు వేయించేలా కృషి చేశానని మ్యాదరి లక్ష్మణ్ తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తూ వచ్చినప్పటికీ, తనకు తగిన గుర్తింపు, న్యాయం లభించలేదనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.ఆరో వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన సమయంలో ఎన్నికల కోసం ఖర్చులు భరించి,ఆర్థికంగా నష్టపోయినా పార్టీ కార్యక్రమాలను కొనసాగించానని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండటంతో పాటు, పార్టీ అనుసరిస్తున్న విధానాలు, పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

జువ్వాడి నర్సింగ్‌రావు, జువ్వాడి కృష్ణారావు దృష్టికి కార్యకర్త ఆవేదన

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్‌లకు ఉద్దేశించిన తన ప్రకటనలో మ్యాదరి లక్ష్మణ్ ఈ విషయాలను ప్రస్తావించారు.పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల సేవలను గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరాన్ని ఈ పరిణామం గుర్తుచేస్తోంది. అయితే, తన ఆవేదనపై పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

31వ వార్డులో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం!

- ఆరు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్‌పై పట్టించుకోని అధికారులు..
- దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలతో ప్రజలకు ప్రమాదం!
- లో వోల్టేజ్ సమస్యతో వార్డు ప్రజల ఇబ్బందులు..
- విద్యుత్ శాఖ తీరుపై కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ ఆగ్రహం



కోరుట్ల, అక్టోబర్ 22 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో విద్యుత్ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వార్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలని గత ఆరు నెలలుగా విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై 31వ వార్డు కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఇంతకాలం గడిచినా స్పందించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

– ఆరు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కోసం విజ్ఞప్తులు

31వ వార్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరును షిఫ్ట్ చేయాలని గత ఆరు నెలలుగా సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం లభించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న అంశాలపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉందని ఆమె పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ విషయంలో ఇకనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

– దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు.. ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన

31వ వార్డులో కొన్ని విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారని కౌన్సిలర్ తెలిపారు. దెబ్బతిన్న స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాల పరిస్థితిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రమాదాలకు అవకాశం లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యుత్ వ్యవస్థలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తించినప్పుడు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పరిశీలించి, అవసరమైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

– లో వోల్టేజ్ సమస్యతో ప్రజలకు ఇబ్బందులు

ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ సమస్యతో పాటు 31వ వార్డులో లో వోల్టేజ్ సమస్య కూడా ఉందని కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యల కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని, లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె అన్నారు. ప్రజలు పదే పదే అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

– ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి

ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఎలుగూరి శ్వేతా కిరణ్ పేర్కొన్నారు. అదే విధంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని అన్నారు.గత ఆరు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ కోసం విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి 31వ వార్డులోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు.

–ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్, స్తంభాల మరమ్మతులు తక్షణమే చేపట్టాలి

31వ వార్డులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్ చేయడంతో పాటు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఆరు నెలలుగా కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ సమస్యకు అధికారులు ఎప్పుడు పరిష్కారం చూపుతారోనని 31వ వార్డు ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, వార్డులోని విద్యుత్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఎలుగూరి శ్వేతా కిరణ్ కోరుతున్నారు.





ప్రజా వీరుడు పండుగ సాయన్న

కలెక్టరేట్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజా జ్యోతి. నిజాం నిరంకుశత్వానికి,భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ 'పండగ సాయన్న' జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజం ప్రభువుల ధాన్యం కారాగాన్ని కొలగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అని అన్నారు. ధనవంతుల నుండి, పెట్టు బడుదారుల వ్యవస్థ నుండి భూస్వాముల నుండి, అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారి పై తిరుగుబాటు చేశాడన్నారు. తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఏ ఓ కిషన్, సిబ్బంది , బీసీ సంఘాల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

- 18 నుంచి 35 ఏళ్ల ఎస్టీ యువతీ యువకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం.

జగిత్యాల, అక్టోబర్ 22, ప్రజాజ్యోతి. జిల్లాలోని మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన నిరుద్యోగ ఎస్టీ యువతీ యువకులకు 2026 సంవత్సరానికి సంబంధించి ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ బి. సత్యప్రసాద్ ఐఏఎస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) మైదాన ప్రాంతాల విభాగం, ట్రైకార్ (TRICOR) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన యువతకు ప్రముఖ జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

18–35 ఏళ్ల వారికి అవకాశం

జగిత్యాల జిల్లాలోని మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగ ఎస్టీ యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిగా ఉచితంగా అందించడంతో పాటు అవసరమైన కోర్సు మెటీరియల్‌ను కూడా అందజేస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు.

వివిధ రంగాల్లో శిక్షణ

అప్పారెల్, మేడ్-అప్స్ అండ్ హోమ్ ఫర్నిషింగ్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (AMHSSC), అగ్రికల్చర్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ASCI), బ్యూటీ అండ్ వెల్‌నెస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (B&WSSC), టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ (THSC), అగ్రికల్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (AFC) ఇండియా లిమిటెడ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (NI-MSME) వంటి సంస్థల ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ అందించనున్నారు.

అవసరమైన ధ్రువపత్రాలు

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో దరఖాస్తు కోసం సంప్రదించాలి. దరఖాస్తుదారులు మీ సేవ ద్వారా జారీ చేసిన స్థానిక ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ధ్రువపత్రాలు (ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లొమా), ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు అన్ని ధ్రువపత్రాల ఒరిజినల్స్, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలి. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం అభ్యర్థులు అన్ని పని దినాల్లో జగిత్యాల జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.